చివరికి మిగిలింది...

పప్పుశనగ రైతు కుదేలు..!

కష్టం.. నష్టం..!

భూమిలో విత్తనం వేసేటప్పుడు రైతు ఎన్నో కలలు గంటాడు.. మొలకెత్తినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడల నుంచి పంటను ఎలాగో కష్టపడి పండిస్తే.. చివరికి ధర ఉండదు. పప్పుశనగ రైతుల పరిస్థితి దారుణంగా తయారయింది. గత సంవత్సరం కంటే దిగుబడి బాగానే వచ్చింది. ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందే కానీ కొనుగోలుపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అయినకాడికి అమ్ముకుంటున్నారు. చివరికి రైతుకు చేసిన కష్టం.. పెట్టుబడులతో నష్టమే మిగిలింది.



బెళుగుప్ప వద్ద మిషన్‌తో శనగ పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం

విడపనకల్లు వద్ద పొలంలో ఆరబోసిన శనగ

- మార్కెట్‌లో రూ.5వేల నుంచి రూ.5,500
- మద్దతు ధరతో కొనేదెన్నడో..?
- గోదాముల్లో నిల్వ చేసుకుంటున్న రైతులు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప/విడపనకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ రైతుకు నష్టాలు తప్పని పరిస్థితి నెలకొంది. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి దిగుబడి కొంత పెరిగింది. ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 85 శాతానికిపైగా పప్పుశనగ పంట కోతలు పూర్తయ్యాయి. మరో వారం రోజుల్లో పంట కోతలు మొత్తం పూర్తవుతాయి. ఇప్పటికే పంట కోత పూర్తి చేసుకున్న రైతుల్లో ఎక్కువ మంది పప్పుశనగను నిల్వ చేసుకుంటున్నారు. మరికొంత మంది ధర పెరుగుతుందో..? లేదోనన్న అనుమానంతో వ్యాపారులకు అమ్మేస్తున్నారు. గతంతో పోలిస్తే దిగుబడి ఎక్కువగా రావడం, పాత సరుకు ఉండటంతో నిల్వలు మరింత పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు మరింతగా తగ్గితే నష్టపోతామన్న భయంతోనే కొందరు రైతులు అయినకాడికి అమ్మేస్తున్నారు. మరికొందరు ధర పెరుగుతుందన్న ఆశతో గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు.

దిగుబడిలో వ్యత్యాసం

ఈ రబీ సీజన్‌లో జిల్లాలో 57వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగయింది. జిల్లాలోని ఒక్కో మండలంలో ఒక్కో రకంగా దిగుబడులు వచ్చాయి. పుట్లూరు మండలంలో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ ప్రాంతంలో తెగుళ్లు ఎక్కువగా సోకడంతో దిగుబడి తగ్గింది. ఉరవకొండ నియోజకవర్గంలో ఎకరాకు 4-6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లోని ఎకరాకు 7-8 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. పంట బాగా పండితే ఎకరాకు 10-14 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. గత సంవత్సరం రబీలో తీవ్ర వర్షాభావంతో పప్పుశనగ దిగుబడి రాలేదు. ఎకరాకు క్వింటా నుంచి 3 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చింది. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి గతంతో పోలిస్తే దిగుబడి పెరిగినా ధర లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

నాణ్యత ఆధారంగా ధరలు

ప్రస్తుతం పప్పుశనగ నాణ్యత ఆధారంగా రూ.5వేల నుంచి రూ.5,500 దాకా పలుకుతోంది. ఈసారి శనగ బుడ్డలు ఊరే సమయంలో వర్షం రావడం, తెగుళ్ల ప్రభావంతో విత్తనాలు నల్లగా మారాయి. ఇలా నల్లగా మారిన పంటకు తక్కువ ధరతో అడుగుతున్నారు. మరోవైపు నాణ్యత బాగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. రబీ సీజన్ ఆరంభంలో విత్తనం విత్తేందుకు క్వింటా రూ.7వేల నుంచి రూ.8వేలతో కొనుగోలు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన తర్వాత కొనుగోలు చేసిన ధర కూడా లభించకపోవడంతో రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత సంవత్సరంలో పంట కోత సమయంలో క్వింటా రూ.5,500 పలికింది. ఆ తర్వాత కొన్ని నెలలకు క్వింటా పప్పుశనగ రూ.6వేల నుంచి రూ.6,500 పలికింది. కొన్నేళ్ల క్రితం క్వింటా రూ.10వేలకుపైగానే అమ్ముడుపోయింది. తర్వాత ప్రతి యేటా ధర తగ్గుతూ వస్తోంది. దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మద్దతు ధరతో కొనేదెన్నడో..?

ఈసారి పప్పుశనగ క్వింటాకు మద్దతు ధర రూ.5,650గా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 85 శాతానికిపైగా కోతలు పూర్తయ్యాయని, కొనుగోలు చేసేందుకు అనుమతించాలని జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు పంపింది. ఇప్పటి దాకా మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు. గత సంవత్సరంలో కనీస మద్దతు ధర రూ.5,440 నిర్ణయించారు. అప్పట్లో అంతే ధర బహిరంగ మార్కెట్‌లో పలుకుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు ఆసక్తి చూపలేదు. దీంతో అప్పట్లో ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయలేకపోయింది.



గిట్టుబాటు ధర లేదు

నేను 25 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. ఈసారి పంటకు తెగుళ్లు సోకాయి. అయినప్పటికీ గతంతో పోలిస్తే దిగుబడి కొంత పెరిగింది. ఎకరాకు 3 నుంచి మూడున్నర క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. విత్తనం వేసేందుకు క్వింటా రూ.8వేలతో పప్పుశనగ కొన్నాం. కష్టపడి పంట పండించిన తర్వాత క్వింటా రూ.5వేల నుంచి రూ.5,500కే అడుగుతున్నారు. మద్దతు ధరతో కొనుగోలు చేసి ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- బ్రహ్మయ్య, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నేను 40 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. ఎకరాకు నాలుగు నుంచి నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో శనగ పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి. గిట్టుబాటు ధరలేకపోతే గోదాముల్లో నిల్వ చేసుకోవాల్సిందే.

-మాదినేని శ్యామ్, వెంకటాద్రిపల్లి, బెళుగుప్ప మండలం



విడపనకల్లులోని గోదాములో నిల్వ ఉంచిన శనగ



6 ఏళ్లుగా నిలిచి పోయిన పనులు

గడేకల్లులో నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు

రోగాలు తెచ్చిన రహదారి..!

- దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తుల వ్యాధులతో ఆసుపత్రిపాలు
- గడేకల్లు, డొనేకల్లు వాసుల గోడు పట్టని అధికారులు

విడపనకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రహదారులు నిర్మిస్తున్నారంటే ఎక్కడైనా జనం సంతోషిస్తారు. కానీ.. విడపనకల్లు మండలంలోని గడేకల్లు, డొనేకల్లు వాసులు మాత్రం ఈ రహదారి తమ ప్రాణాల మీదకి తెచ్చిందని వాపోతున్నారు. 67వ జాతీయ రహదారి పనులు ప్రారంభించి ఆరేళ్లవుతోంది. రూ. 500 కోట్లతో నాలుగు లేన్ల పనులు ప్రారంభించారు. కానీ ఈ గ్రామాల మధ్యలో పనులు చేయకుండా వదిలేశారు. గడేకల్లులో ఊరి చివర నుంచి దాదాపుగా కిలోమీటరు దూరం రోడ్డును తవ్వి వదిలేశారు. ఆరు సంవత్సరాలుగా పనులు చేయకపోవడంతో వాహనాల రద్దీకి భారీగా దుమ్ము లేస్తోంది. రోడ్డు వేయాలని గ్రామస్థులు ఆందోళనలు చేస్తున్నా ఏ ఒక్క అధికారి స్పందించలేదు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామ ప్రజలు రోగాలబారిన పడి బళ్లారిలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకుంటున్నారు. బొల్లినేని రమేష్ అనే వ్యక్తికి దుమ్ము వల్ల ఆరోగ్యం దెబ్బతినింది. మూత్రం రాకపోవటంతో బళ్లారిలోని ప్రైవేటు ఆసుపత్రిలో రూ. 1.50 లక్షల వరకూ ఖర్చు పెట్టి వైద్యం చేయించుకున్నట్లు తెలిపారు. గడేకల్లుకు చెందిన లక్ష్మీదేవి అనే వృద్ధురాలు దుమ్ము వల్ల ఊపిరి తిత్తుల వ్యాధిన పడి ప్రతి వారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకుంటోంది. ఇలా వందలాది మంది గ్రామస్థులు నిత్యం ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది.

మంత్రి చెప్పినా కదలని అధికారులు

గత సెప్టెంబరు నెల 21న గడేకల్లు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పనులు చేయించాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు గడేకల్లు, డొనేకల్లు గ్రామస్థులు విన్నవించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి అధికారులను పిలిచి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. వారం రోజుల్లోనే ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. నాలుగు నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. కనీసం దుమ్ము లేయకుండా ట్యాంకర్లతో నీటి తడులు పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనారోగ్యంతో రూ. 1.50 లక్షలు ఖర్చు

మా ఇల్లు జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ఆరు సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. ఇప్పటి వరకూ ఏ నాయకుడూ, ఏ అధికారి పట్టించుకోలేదు. వాహనాలు విపరీతంగా తిరుగుతుండడంతో దుమ్ము ఎక్కువై నాకు మూత్ర సమస్య వచ్చింది. బళ్లారి ఆసుపత్రిలో వారం రోజులు ఉన్నా. రూ.1.50 ఖర్చు చేసి చికిత్సలు చేయించుకున్నా. రోడ్డు పనులు పూర్తి చేసి మా ఆరోగ్యాలను కాపాడండి.

-బొల్లినేని రమేష్, డొనేకల్లు



ఎవరూ పట్టించుకోలేదు

ఆరు సంవత్సరాలుగా రోడ్డు పనులు చేయకుండా నిలిపివేశారు. ప్రతి రోజూ నరకం అనుభవిస్తున్నాం. ఎంత మందికి చెప్పినా పట్టించుకోలేదు. ధర్నాలు, రాస్తారోకోలు చేశాం. జిల్లా అధికారులు, రాజకీయ నాయకులకు తెలిపాం. ఏ ఒక్కరూ మా సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుపై దుమ్ములేయకుండా కనీసం నీటిని కూడా వేయడం లేదు. ఈ దుమ్ము వల్ల లేని రోగాలు వచ్చి చచ్చేటట్లు ఉన్నాం.

- రామాంజనేయులు, గడేకల్లు



ఇలాగైతే ప్రాణాలు పోతాయి: గోపాల్, డొనేకల్లు



జాతీయ రహదారి పనులు చేయక పోవటంతో రోడ్డు పక్కనే ఉన్న మా ఇంటిలోకి విపరీతంగా దుమ్ము వస్తోంది. దీంతో నాకు ఆయాసం ఎక్కువ అవుతోంది. దగ్గు ఎక్కువై ఎక్కడ ప్రాణాలు పోతాయో అని భయంగా ఉంది. ఈ దుమ్ము ఇలాగే వస్తూ ఉంటే త్వరలోనే మా ప్రాణాలు పోతాయని భయంగా ఉంది. అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకుని రోడ్డు పనులు చేపట్టి మా ప్రాణాలు కాపాడాలి.



లారీ వెళుతుండగా లేస్తున్న ధూళి

ఆయాసానికి చికిత్స

రోడ్డుకు దగ్గరగా కిరాణ షాపు నిర్వహిస్తున్నా. జాతీయ రహదారిపై రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో విపరీతమైన దుమ్ము వస్తోంది. మాస్కు పెట్టుకుంటున్నా ఫలితంలేదు. దుమ్ము ధూళి వల్ల నాకు ఆయాసం ఎక్కువయింది. ఊపిరి తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి వారం కర్నూలుకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నా. ఇక్కడ బతక లేక పోతున్నాం. ఇలాగే ఉంటే మా ప్రాణాలు పోవటం ఖాయం.

-లక్ష్మీదేవి, గడేకల్లు

మద్యం దుకాణాలకు లాటరీ

గీత కులస్థులకు 11 కేటాయింపు



లాటరీ తీస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లాటరీ ద్వారా జిల్లాలోని 11 మద్యం దుకాణాలను గీత కులస్థులకు కేటాయించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశపు హాలులో లాటరీ నిర్వహించారు. ప్రాంతాల వారిగా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, నెంబర్లను ఎక్సైజ్ అధికారులు చదివి వినిపించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ దరఖాస్తుదారుల సమక్షంలో మద్యం షాపుల వారిగా బాక్సులోకి నెంబర్లను వేసి కలియతిప్పి లాటరీ తీశారు. అప్పటికప్పుడే లాటరీ తగిలిన వారికి మద్యం దుకాణాలు కేటాయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఏఈఎస్ రేవతి, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. దరఖాస్తులు దాఖలు కాని డి. హిరేహాళ్, రాయదుర్గం రూరల్ మండలం, గుత్తి రూరల్ మండలాల్లోని మద్యం దుకాణాలపై ప్రభుత్వం నిర్ణయం మేరకు ముందుకు వెళతామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న గీత కులస్థులు ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి మొదటి విడత లైసెన్స్ ఫీజులు చెల్లించారు. వ్యాపారులకు వారం రోజులపాటు ప్రొవిజనల్ లైసెన్స్‌లు జారీ చేశారు. మంగళవారం నుంచి ఎప్పుడైనా దుకాణాలు తెరుచుకోవచ్చునని సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



గరుడ వాహనంపై విహరిస్తున్న కొండమీదరాయుడు

కన్నుల పండువగా గరుడ సేవ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కొండమీదరాయుడు బ్రహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. సోమవారం స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. గరుత్మంతుడిపై ఊరేగే కొండమీదరాయుడుని దర్శించుకోవడం ద్వారా సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఉదయం కొండమీదరాయడుస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి స్వామిని ఊరేగించారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు సూర్యనారాయణ, చందుస్వామి, శ్రీనాథ్ ఆచార్యులు, గురుస్వామి, శివకుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గజవాహన సేవ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వసూల్ రాజా ఔట్

డీసీటీఓ సుబ్బరాయుడు సస్పెన్షన్



డీసీటీఓ, ఆయన కుమారుడితో వాదిస్తున్న వాహనదారుడు (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో వాహనాల తనిఖీలు చేసి వసూళ్లకు పాల్పడిన డీసీటీఓ సుబ్బరాయుడుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు పన్నుల శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో సంక్రాంతి పండుగ సందర్భంగా రాత్రి సమయంలో కారులో వెళ్తూ డోన్ టోల్‌గేట్ వద్ద నల్ల బండలు తరలిస్తున్న వాహనాలను ఆపి, డబ్బు వసూలు చేస్తున్న వీడియో బయటకు వచ్చింది. వాహనంలో డీసీటీఓ సుబ్బరాయుడు.. తన కుమారుడుతో కలిసి ఉన్నారు. ఆ సమయంలో వాహనదారులు.. డీసీటీఓను నిలదీశారు. పన్నుల శాఖలో ఏ క్యాడర్ అనీ, తనిఖీ చేసే అధికారం ఎవరిచ్చారనీ, మద్యం మత్తులో ఉన్నారంటూ వాగ్వాదం చేశారు. అందుకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించిన పన్నుల శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ శేషాద్రి.. నివేదిక ఇవ్వాలని సీటీఓ-2 నరసింహులును ఆదేశించారు. తాజాగా నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఆ మేరకు కమిషనర్.. డీసీటీఓను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాసిరకంపై చర్యలు షురూ..!

- ఇన్నాళ్లు తొక్కిపెట్టిన కొందరు అధికారులు
- 2010 నుంచి కేసుల కూపీ లాగుతున్న ప్రభుత్వం
- కమిషనరేట్‌కు నివేదికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నాసిరకం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగా 2010 నుంచి ఇప్పటిదాకా ఏడాది వారిగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి ఎన్ని శాంపిళ్లు నాసిరకంగా తేలాయి..? కోర్టులో ఎన్ని కేసులు ఫైల్ చేశారు..? అవి ఏయే దశల్లో ఉన్నాయి..? కోర్టులో కేసు వేయనివి ఎన్ని ఉన్నాయి..? తదితర వివరాలు పంపాలని కమిషనరేట్ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పక్షం రోజులుగా మండల స్థాయి నుంచి పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు సమగ్ర నివేదికలను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపారు. వాటి ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. జిల్లాలోని పలువురు అధికారులు నాసిరకం ఎరువులు, పురుగు మందులు, విత్తనాలపై కోర్టులో కేసు ఫైల్ చేయకుండా జాప్యం చేసినట్లు నివేదికల ద్వారా తేలింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎట్టకేలకు నాసిరకంపై చర్యలు తీసుకోనున్నారు.

నాసిరకం వివరాలివీ..


15 ఏళ్లుగా జిల్లాలో ఎరువులకు సంబంధించి 175 శాంపిళ్లు నాసిరకంగా తేల్చారు. వీటిలో 40 రీ ఎనలైజ్‌లో కరెక్ట్‌గా ఉన్నట్లు తేలాయి. 135 కేసుల్లో చట్ట పరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. 3 కేసులు కోర్టులో పలు దశల్లో ఉన్నాయి. మరో 132 కేసులు కోర్టులో ఫైల్ చేయాల్సి ఉంది. పురుగు మందులకు సంబంధించి 68 శాంపిళ్లు నాసిరకంగా తేల్చారు. వీటిలో 21 శాంపిళ్లు రీ ఎనలైజ్‌లో కరెక్ట్‌గా ఉన్నట్లు తేలింది. 47 కేసులు చట్టపరంగా చర్యలు తీసుకునేవి ఉండగా.. ఇందులో 15 కేసులు కోర్టులో పలు దశల్లో ఉన్నాయి. ఇంకా 32 శాంపిళ్లపై కేసులు ఫైల్ చేయాల్సి ఉంది. విత్తనాలకు సంబంధించి 140 శాంపిళ్లు నాసిరకంగా తేల్చారు. ఇందులో 73 చట్ట పరంగా చర్యలు తీసుకునేవి ఉండగా.. 24 కేసులు కోర్టులో పలు దశల్లో ఉన్నాయి. మరో 48 శాంపిళ్లపై కోర్టులో కేసు ఫైల్ చేయాల్సి ఉంది.

యూరియా దోపిడీ

- ఒక్కో లారీకి అదనంగా రూ.10 వేలు వసూలు

(7లో..)

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	34.0
కనిష్ఠం	19.0

రుచి.. శుచి

ఖైదీలకు నాణ్యమైన ఆహారం.. మెనూలో మార్పులు



వంట చేస్తున్న ఖైదీలు

6

అధనపు బాధ్యతలు..?

ఓ ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారం (వివరాలు 6లో..)

ఆకాశ కుసుమం



935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవరం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులు న్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతుతున్నాయ న్నారు. అదేవిధంగా 36వ ప్యాకేజీ కింద శీర్పి, బెళుగుప్ప చెరువు లకు 100 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ .5వేలు, సరాసరి రూ. 16,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రుచి.. శుచి



ఖైదీలకు నాణ్యమైన ఆహారం.. మెనూలో మార్పులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జైలు జీవితాన్ని తలచుకోవడానికే భయపడిపోయేవారు. నాలుగుగోడల మధ్య ఒంటరిగా నలిగిపోవడం ఒకటైతే... ఆహారం విషయంలో మరింత కఠిన నిబంధనలు ఉంటాయని చెప్పుకునేవారు. బ్రిటిష్ కాలం నుంచి జైళ్ల శాఖలో కఠిన నిబంధనలు పాటించేవారు. ఏదైనా తప్పు చేస్తే... 'జైల్లో చిప్పకూడు తింటావ్.. జాగ్రత్త..' అనే ఊతపదం ఇప్పటికి నాణుడిలో ఉంది. జైళ్ల శాఖలో వచ్చిన నూతన సంస్కరణలతో రిమాండ్ ఖైదీలు, జీవిత ఖైదీలకు పెట్టే భోజనంలో పెనుమార్పులు వచ్చాయి. చాలా మందికి జైలులో ఉండే ఖైదీలు ఏమి తింటారన్న విషయంపై ఆసక్తి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆంధ్రజ్యోతి అనంతపురం రెడ్డిపల్లి జిల్లాజైలులో కటకటాల వెనుక ఎలాంటి వంటలు చేస్తారో తెలుసుకునే ప్రయత్నం చేసింది.


వంట చేస్తున్న ఖైదీలు


జైలులో ఖైదీలకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కొలతల ప్రకారం మెనూ

గతంలో ఖైదీలు తినే ఆహారం అధ్వాన్నంగా ఉండేది. ఉడికీ ఉడకని అన్నం... ఉప్పు, కారం లేని నీళ్ల చారు, నీళ్ల పప్పు పెట్టే వారు. తినే ప్లేట్లు కూడా దారుణంగా ఉండేవి. కాఫీ, పాలు, ఇచ్చేవారు కాదు. ఉదయం 9-30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు మాత్రమే భోజనం పెట్టేవారు. సంస్కరణల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఆహార శైలిని బట్టి మెనూలో మార్పులు తెచ్చారు. ఆహార నిపుణుల సూచనల మేరకు వడ్డిస్తున్నారు. ప్రతి వస్తువును సంబంధిత ఆరోగ్య ప్రమాణాలకు తగిన నిష్పత్తిలో తూకం వేస్తారు. ఉదారణకు... చపాతీల కోసం ప్రతి ఖైదీకి 400 గ్రాములు ఇస్తారు. ఆ మేరకు పరిమాణాన్ని బట్టి మూడు లేదా నాలుగు చపాతీలు ఇస్తారు. కంది, శనగ, పెసర పప్పులు 80 గ్రాములు, మటన్, చికెన్ 175 గ్రాములు, కూరగాయలు 200 గ్రాములు, పాలు 140 మి.లీ., బియ్యం 600 గ్రాములు.. ఇలా మెనూ కొలతలు నిర్ణయించారు.

రుచికరంగా వంటలు

జైలులో ఉన్న ఖైదీలే వంట వండుతారు. తోటి ఖైదీలకు ఆహారం వండే విషయంలో పరిశుభ్రతతో పాటు నాణ్యత పాటిస్తున్నారు. గతంలో జైలులో అల్పాహారం, పాలు ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం జైలులో ఉదయం 7 గంటలకు పాలు, కాఫీ, టీ, 7:30 గంటలకు అల్పాహారం పెడుతున్నారు. అల్పాహారంగా.. చపాతీ, ఉప్మా, పులిహోరా, పొంగల్ పెడుతున్నారు. మధ్యాహ్నం భోజనం 11 నుంచి 12 గంటల మధ్య వడ్డిస్తారు. ఇందులో అన్నం, కాయగూరల సాంబారు, కందిపప్పు, శనగ పప్పు, పెసర పప్పు, రసం, వేపుడు, పెరుగు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు టీ లేదా పాలు ఇస్తారు. సాయంత్రం 5-30 నుంచి 6 గంటల మధ్య మధ్యాహ్నం చేసిన కూరలు కాకుండా మెనూలో మార్పులు చేసి వండుతారు. ప్రతినెలా మొదటి ఆదివారం మటన్ కర్రీ, మిగిలిన ఆదివారాల్లో చికెన్ వడ్డిస్తారు. ప్రతి మంగళవారం కోడి గుడ్డు ఉంటుంది. దీంతో పాటు జాతీయ, రాష్ట్రానికి సంబంధించిన పండగలకు స్వీట్లు పెడతారు. తాగేందుకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు.

వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక ఆహారం

ఖైదీలు ఏదైనా అనారోగ్యం బారిన పడితే ప్రత్యేక మెనూ అమలు చేస్తారు. షుగర్ ఉన్న వారికి చపాతీ, నూనె లేని రోటీలు ఇస్తారు. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్య ఉన్నవారికి పెరుగుతో కూడిన భోజనం ప్రత్యేకంగా వడ్డిస్తారు. వీఐపీ ఖైదీలకు కోర్టు అనుమతి మేరకు బయటి నుంచి ఆహారం అందిస్తారు.


జైలులో మినరల్ వాటర్ ప్లాంట్

సంస్కరణలతోనే నాణ్యమైన భోజనం

గతంలో ఖైదీల ఆహారం విషయంలో కొంచెం కఠిన నిబంధనలు ఉండేవి. 2010లో తీసుకు వచ్చిన జైలు సంస్కరణలతో చాలా మార్పులు వచ్చాయి. అందులో భాగంగా ఖైదీలకు ప్రభుత్వం రుపొందించిన ఆహార నియమాలను అమలు చేస్తున్నాం. ఖైదీలకు నాణ్యమైన భోజనం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నాం.

-షఫీవుర్ రెహమాన్,
సూపరింటెండెంట్, జిల్లా జైలు



అధనపు బాధ్యతలు..?

- నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ఒక్కో వార్డెన్‌కు మూడేసి వసతిగృహాల అప్పగింత
- సంక్షేమ వసతిగృహాల పర్యవేక్షణ గాలికి..
- ఆరోపణలొచ్చినా చర్యలకు మీనమేషాలు
- ముడుపుల వ్యవహారమే కారణమా..?

శ్రీసత్యసాయి జిల్లాలో గాడితప్పిన బీసీ వసతి గృహాల పాలన





ఓ ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారం

అనంతపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా రెండుగా విడిపోయింది. పాలనను వికేంద్రీకరించారు. అయితే కొన్నిశాఖల పాలన నేటికీ అనంత జిల్లా నుంచే సాగుతోంది. ఆ కోవకు చెందినదే బీసీ సంక్షేమశాఖ. ఈశాఖ శ్రీసత్యసాయి జిల్లా బాధ్యతలను డిప్యూటీ డైరెక్టర్ కింది స్థాయి అధికారికి అప్పగించారు. ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో బీసీ వసతిగృహాల పాలన పూర్తిగా గాడి తప్పింది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఆ అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారు. దీంతో వసతి గృహాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు మరో వసతిగృహాలకు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను అప్పగించడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని, ముడుపులపై విచారణ చేయాలని అనేక విద్యార్థి సంఘాలు, కులసంఘాలు ఆందోళనలు చేపట్టారు. అలాగే ఆ జిల్లా కలెక్టర్‌కే స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేయడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

నిబంధనలు గాలికి..


శ్రీ సత్యసాయి జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 57 బీసీ వసతిగృహాలు ఉన్నాయి. అందులో కదిరి డివిజన్ పరిధిలో 15, ధర్మవరం డివిజన్ 13, హిందూపురం డివిజన్‌లో 13, పెనుకొండ డివిజన్ పరిధిలోని 16 వసతి గృహాలు ఉన్నాయి. అయితే వీటి పర్యవేక్షణకు 23 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. వారిలో 8 మంది క్లాస్-4 ప్రమోట్ వార్డెన్లు కాగా... మిగిలిన 15 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. సగటున ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 200 పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి వసతిగృహంలో కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు... ఉదయం, సాయంత్రం వేళల్లో చదివించే బాధ్యత వార్డెన్లదే. భద్రత కూడా వారిదే. ఆ వసతిగృహాల పర్యవేక్షణ సవ్యంగా సాగుతోందో లేదా అనేది నిత్యం సమీక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. అయితే బీసీ వసతిగృహాలకు సరిపడా వార్డెన్లు లేకపోవడంతో సమీపంలో ఉన్న వసతిగృహాల పర్యవేక్షణ కోసం ఉన్న వార్డెన్లకే అదనపు బాధ్యతలను కేటాయించే అధికారం ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. ఇదే ఆ అధికారికి కలిసి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక వసతి గృహాన్ని పర్యవేక్షించే రెగ్యులర్ వార్డెన్‌కు దానికి 20 కి.మీ పరిధిలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలి. అయితే ఆ అధికారి ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ తనకు అనుకూలమైన వార్డెన్లకు 40 నుంచి 50 కి.మీ దూరంలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీని వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వసతిగృహం పర్యవేక్షణపైనే సంబంధిత వార్డెన్లు సమయపాలన పాటించరనే విమర్శలున్నాయి. అట్లాంటిది 50 కి.మీలలోపు ఉన్న మరో వసతిగృహాన్ని పర్యవేక్షించడం సాధ్యమా అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యంలో వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డగోలుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు

బీసీ వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక భారీగా ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలు ఆ అధికారిపై తొలి నుంచీ వినిపిస్తూనే ఉన్నాయి. కదిరి డివిజన్‌లోని ఓ మండలంలో బీసీ హాస్టల్ వార్డెన్ విద్యార్థుల భోజనం కోసం సరఫరా చేసిన సరుకులు, బియ్యం అమ్ముకోవడం ఆధారాలతో బయటపడినా ఆయనపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఆ వార్డెన్‌పై విచారణ జరిగి, వాస్తవాలు వెలుగుచూసినా చర్యలు తీసుకోకపోవడం వెనుక రూ. వేలాది రూపాయల ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆవార్డెన్‌కు చార్జ్ మెమోతో సరిపెట్టి విచారణ నివేదికను అటకెక్కించారనే విమర్శలున్నాయి. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక ఒక్కో వసతిగృహం నుంచి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకూ ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. డైట్ బిల్లులు మంజూరైనా సందర్భంలోనూ... ఏ వసతిగృహానికి ఎంత మొత్తం బిల్లు మంజూరయ్యిందో... ఆ మొత్తంలో 6 నుంచి 8 శాతం వరకూ ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాలే బహిరంగంగా చెప్పుకుంటున్నాయి. జిల్లాలోని ఓ డివిజన్‌లో పనిచేసే ఓ వార్డెన్‌కు ఏబీసీడబ్ల్యూఓ ఉద్యోగోన్నతి కల్పించేందుకు రూ. లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్న వార్డెన్లను కాదని ముడుపులు చెల్లించినవారికి ప్రమోషన్ కట్టబెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముడుపుల వసూళ్ల కోసం తన కార్యాలయంలో పనిచేసే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని మధ్యవర్తిగా నియమించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని..

- ధర్మవరం డివిజన్‌లోని బుక్కపట్నం వార్డెన్‌కు హిందూపురం డివిజన్‌లోని రెడ్డిపల్లి వసతి గృహం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం నుంచి రెడ్డిపల్లి వసతిగృహానికి వెళ్లాలంటే... దాదాపు 70 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదే వార్డెన్‌కు ముదిగుబ్బ మండలం వై.వి పల్లి బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం-వై.వి పల్లికి 40 కి.మీ దూరం ఉంది. ఒక్క వార్డెన్‌కు మూడు వసతి గృహాలను అప్పగించారంటే... ఆ వార్డెన్ ఆ మూడు వసతిగృహాలను పర్యవేక్షించడం సాధ్యమా అన్నది ఆ అధికారే చెప్పాలి.
- కదిరి డివిజన్‌లో తిమ్మమ్మ మర్రిమానులోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరిలోని ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ రెండు వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కదిరికి వెళ్లాలంటే దాదాపు 30 కి.మీ దూరం ఉంది. ఆ వార్డెన్‌కు మూడు వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.
- ధర్మవరం డివిజన్ పుట్టపర్తిలోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరి డివిజన్‌లోని నల్లమాడ కాలేజీ బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా పెనుకొండ, హిందూపురం డివిజన్లలోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.



తన శాఖలో జరుగుతున్న అక్రమాలను నిరోధించాల్సిన బాధ్యత బీసీ సంక్షేమశాఖకు సారథ్యం వహిస్తున్న జిల్లాకు చెందిన మంత్రి సవిత పైనే ఉంది. అలాగే ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయించాల్సిన బాధ్యత కూడా ఆమెపైనే ఉందనడంలో సందేహం లేదు. అక్రమ వసూళ్లతో వసతి గృహాలను భ్రష్టు పట్టిస్తున్న ఆ అధికారిపై ఏ మేరకు చర్యలకు ఉపక్రమిస్తారో వేచి చూడాల్సిందే.

పట్టు తప్పితే..!

ఓటీపీఆర్ఐ విద్యార్థుల భయంలేని పనులు

డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే 'సాహసాలు'


ఐదు అంతస్థులపై నుంచి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ఎక్కిన విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మనిషి సగటు ఎత్తుపై నుంచి పడితేనే.. కాళ్లు, చేతులు విరుగుతాయి. అదే ఐదు అంతస్థులపై నుంచి పడితే ఇంకేముంది ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. అలాంటి పరిస్థితే సోమవారం జేఎన్టీయూ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ(ఓటీపీఆర్ఐ) కళాశాలలో జరిగింది. సాక్షాత్తు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే ఇలాంటి భయంలేని పనులు చేయడం గమనార్హం. కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ఫార్మా-డీ కోర్సులో విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ఈ బ్యాచ్‌తోపాటు ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం బ్యాచ్‌లకు వేరువేరుగా వినూత్నంగా పేర్లు పెట్టడానికి సంకల్పించారు. పేరును సర్‌ప్రైజ్‌గా ప్రదర్శించాలని (రివీల్) ఫ్లెక్సీ తయారు చేయించారు. విద్యార్థులు ఉత్సాహంతో వినూత్నంగా చేయాలని తలపించారు. ఇందులో భాగంగా కళాశాల ఐదో అంతస్థు భవనంపై నుంచి ఫ్లెక్సీని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఏదైనా పొరపాటు జరిగితే జేఎన్టీయూకి చెడ్డ పేరు వస్తుందన్న అంశాన్ని అధికారులు విస్మరించారు. సాక్షాత్తు డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే విద్యార్థులు భవనంపైకి ఎక్కి ఫ్లెక్సీని జారవిడిచారు. గాలికి ఫ్లెక్సీ ఎగిరిపోవడంతో దానిని విద్యార్థులు పట్టుకోవడానికి యత్నించారు. దాదాపు 50 అడుగుల ఎత్తులో భవనంపై నిలబడటానికి మినహా పట్టుకోవడానికి ఎలాంటి సాయం లేదు. అయినా విద్యార్థులు ఉత్సుకతతో ప్రమాదపు అంచులకు రావడంతో కిందనున్న విద్యార్థులు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేశారు. ఇలాంటి భయంలేని పనులతో భవిష్యత్‌ను కోల్పోవాల్సిందేనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడితోనైనా డైరెక్టర్, ప్రిన్సిపాల్ తేరుకుని వారించకపోవడంతో మళ్లీ నాలుగో అంతస్థులోకి వచ్చి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ప్రయత్నించారు.

కరాటే, తైక్వాండోపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజ మాన్య స్కూళ్లలో చదివే బాలికలకు ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వడానికి ప్రముఖ సంస్థలు, సొసైటీలు, ట్రస్టుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ పరిశీలన-ఆత్మ రక్షణ ప్రశిక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్య క్రమం కింద శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీయూపీ స్కూళ్లలో 6,7,8 తరగతులు చదివే 4,238 మంది విద్యార్థినులకు, జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, మున్సిపల్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదివే 42,555 మంది విద్యార్థినులకు కరాటే, తైక్వాండో వంటి కళలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కళలపై శిక్షణ ఇవ్వడంలో మూడేళ్ల అనుభవం ఉన్న రిజిస్టరైన జిల్లాలోని ప్రముఖ సంస్థలు, ట్రస్టులు, సొసైటీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉండి, ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో పొంది, వాటిని పూర్తి చేసి ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయంలో అంద జేయాలని ఆమె సూచించారు.

విజేత హిందూపురం

ముగిసిన ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 ఫుట్‌బాల్ టోర్నీ


విజేతగా నిలిచిన హిందూపురం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా హిందూపురం జట్టు నిలిచింది. జనవరి 27 నుంచి ఆంధ్రాఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిసింది. హిందూపురం, కళ్యాణదుర్గం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 2గోల్స్ తేడాతో హిందూపురం జట్టు గెలిచింది. ఇండియా ఉమెన్ ఫుట్‌బాల్ జట్టు హెడ్‌కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ, అసిస్టెంట్ కోచ్ ప్రియ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రికెట్ కోచ్ అనితామిశ్రాల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల రన్నరప్ అనంత


అనంత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడు రోజులుగా నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్-2025 సోమవారం ముగిసింది. ఫైనల్లో కడపతో తలపడిన జిల్లా జట్టు పోరాడి ఓడిపోయింది. తద్వారా రన్నరప్‌గా నిలిచింది. హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ జట్టుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి అక్రమ్‌బాషా, కోచ్ దేవకి, మేనేజర్ సంతోష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుమార్ ఎంటర్‌ప్రైజెస్ రిజిస్ట్రేషన్ రద్దు

జరిమానాకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పాలకు సంబంధించి మాల్టోడెక్సిన్ విక్రయిస్తున్న కుమార్ ఎంటర్ ప్రైజెస్ రిజిస్ట్రేషన్లను పన్నుల శాఖ అధికారులు రద్దు చేశారు. గతంలో ఇతడు కమలానగర్‌లో శ్రీ కుమారి, కుమార్ ఎంటర్ ప్రైజెస్ పేర్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహించాడు. ఆ సమయంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలోని డోర్ నంబర్ 14/279లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తానని పన్నుల శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. డీసీఎంఎస్ కార్యాలయం సమీపంలో డోర్ నంబర్ 14/457లో లావాదేవీలు సాగించాడు. ఈ క్రమంలో గతంలోనే 2023, 2024 ఆ రెండు రిజిస్ట్రేషన్లు రద్దయ్యాయి. తాజాగా సోమవారం సీటీఓ-2 నరసింహులు తనిఖీ చేశారు. తాజాగా హేమావతి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో వ్యాపారలావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఆ రిజిస్ట్రేషన్‌ను సైతం రద్దు చేశారు. జరిమానా సైతం విధించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

హుండీ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రామగిరి మండలం ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని చోరీచేశారు. ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ కేసు నమోదు చేసుకున్నారు. రామగిరి సీఐ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక సరిహద్దు వద్ద నిందితులు ఉన్నట్టు సమాచారం రావడంతో రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బంది ఎంసీపల్లి క్రాస్ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేసి బైకు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,70,712 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసును వారం రోజుల్లో ఛేదించిన సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బందిని ఎస్పీ వి.రత్న అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రామ్‌చరణ్ మృతదేహం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు బత్తలపల్లి మండలం మాళ్యవంతం గ్రామానికి చెందిన మారుతి, సరస్వతి దంపతుల కుమారుడు రామ్‌చరణ్(17) మరికొంత మందితో కలిసి మల్లేనిపల్లి గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి ఇంటికి పెయింటింగ్ వేసేందుకు వెళ్లారు. ఇంటిబయట ఇనుప నిచ్చెన మీద రామ్‌చరణ్ పెయింట్ వేస్తూ పక్కకు మార్చుకునేందుకు నిచ్చెనను తీస్తుండగా ఇంటిపైన ఉన్న కరెంట్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే అక్కడున్న వారు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు..


లక్ష్మీనాయక్ (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్ట తండా సమీపంలోని నీటికుంటలో పడి సోమవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సున్నపుగుట్టతండాకు చెందిన లక్ష్మీనాయక్ (61) ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయితే సోమవారం తెల్లవారు జామున నీటి కుంట ప్రాంతంలో మృతుడి చెప్పులు, దుస్తులు గుర్తించారు. కుంటలో పడి ఉండవచ్చనే అనుమానంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బందితో కుంటలో గాలించారు. నీళ్ల అడుగు భాగంలో కాళ్లకు తీగలు చుట్టుకోవడంతో బయటకు రాలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య మినీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కలువ పువ్వులకోసం తన భర్త కుంటలోకి వెళ్లి ఉంటారని, ప్రమాదవశాత్తు అందులో పడి ఉండవచ్చని మృతుడి భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

కదిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన మేరకు పట్టణంలోని అడపాల వీధిలో నివాసముంటున్న స్వాతి అనే మహిళ, ఈనెల 5న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణం ఆమె భర్త కేశవయ్య వేధింపులే అని మృతురాలి తండ్రి రామక్రిష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో కేశవయ్యను సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు.

యూరియా.. దోపిడీ..!


లారీలో లోడ్ చేసిన యూరియా బస్తాలు (ఫైల్)

- ఒక్కో లారీకి అదనంగా రూ.10 వేలు వసూలు
- పలు కంపెనీల ప్రతినిధుల నిర్వాకం
- కొందరు కీలక అధికారులతో కుమ్మక్కు
- రైతులకు తప్పని భారం

అనంతపురం అర్బన్/పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో యూరియా దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. గత కొన్నేళ్లుగా ఈ దందా సాగుతున్నా ఈ సారి మరింత ఎక్కువైంది. శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. అన్ని రకాల పంటల ఎదుగుదల, అభివృద్ధి, దిగుబడిలో యూరియా కీలకంగా పని చేస్తుంది. యూరియాకున్న డిమాండ్‌ను ఆసరా చేసుకొని కొందరు కీలక అధికారులు, కంపెనీల ప్రతినిధులు కుమ్మక్కై డీలర్ల నుంచి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీని ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతోంది. ప్రతి ఏడాది యూరియాపై అదనపు వసూళ్లకు పాల్పడుతూ కొందరు కీలక అధికారులు, కంపెనీల ప్రతినిధులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

● లారీకి రూ.10వేలు..

కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీ ఇస్తోంది. యూరియా బస్తా పూర్తి ధర రూ.2500, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2233.50 రాయితీ ఇస్తోంది. రైతు వాటా బస్తాకు రూ.266.50లు పడుతుంది. ఒక లారీ 10 టన్నులు (222 బస్తాలు) యూరియా కావాలంటే కొన్ని కంపెనీల ప్రతినిధులు డీలర్ల నుంచి రూ.10వేలు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. యూరియా ఎమ్మార్పీ రూ.266.50 ఉంది. డీలర్ల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో ఒక్కో బస్తాపై అదనంగా రూ.45లు పడుతోంది. అలాగే లారీ బాడుగ, హమాలీ ఖర్చులు కలిసి డీలర్‌కు గిట్టుబాటు కావడం లేదు. అలాగే హోల్ సెల్ డీలర్ వద్ద నుంచి యూరియా తీసుకునే రిటైల్ డీలర్లకు బస్తా రూ.310 పడుతోంది. డీలర్ల నుంచి వసూలు చేసిన సొమ్మును కొందరు కీలక అధికారులకు రహస్యంగా వాటాలు పంచుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

● రైతులపైనే..!

కొందరు కీలక వ్యవసాయ అధికారులతో కుమ్మక్కైన పలు కంపెనీల ప్రతినిధులు యూరియా సరఫరా చేసినందుకు వసూళ్లకు పాల్పడుతుండటంతో ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బులు చెల్లించి యూరియాను డీలర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నేరుగా కంపెనీలు, హోల్ సెల్ డీలర్ల నుంచి యూరియా కొనుగోలు చేసిన రిటైల్ డీలర్లు బస్తా యూరియాను రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లాలోని డీలర్లు యూరియా బస్తా రూ.330 నుంచి రూ.350లకు విక్రయిస్తున్నారు. అనంత జిల్లాలో యూరియా బస్తా రూ.320 నుంచి రూ.350లు దాకా విక్రయిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీల్లో యూరియా బస్తా రూ.275 నుంచి రూ.285లకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు డీలర్లు కొన్ని కో-ఆపరేటివ్ సొసైటీల నుంచి యూరియాను కొనుగోలు చేసి డిమాండ్ లేని ప్రాంతాల్లోని రైతులకు బస్తా రూ.300 నుంచి రూ.310లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ అదనపు భారమంతా రైతులపైనే పడుతోంది. డీలర్లకు ఎమ్మార్పీ కంటే తక్కువ యూరియా అందిస్తే, రైతులకు ఎమ్మార్పీకి విక్రయించే పరిస్థితి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అందుకు విరుద్ధంగా వ్యవహారం నడుస్తోంది.

● శ్రీసత్యసాయి జిల్లాలో వాడకంపై సందేహాలు

శ్రీ సత్యసాయి జిల్లాలో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా ఎరువులు వాడినట్లు సమాచారం. 2024-25 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావంతో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. శ్రీసత్యసాయి జిల్లాలో కరువు పరిస్థితులు మరింత ఎక్కువే. అయితే ఆ జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో కేటాయించిన మోతాదు కంటే ఎక్కువగా యూరియా విక్రయాలు జరగడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 14040 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయం జరుగుతుందని అధికారులు భావించగా 16401 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. 2024 ఖరీఫ్‌లో 14875 మెట్రిక్ టన్నులకుగాను 18561 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్లు ఆ శాఖ అధికారుల నివేదికలు తెలుపుతున్నాయి. అంటే ఖరీఫ్‌లో అదనంగా 3686 మెట్రిక్ టన్నులు అదనంగా విక్రయాలు జరిగాయి. అనంత జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 33989 మెట్రిక్ టన్నులు కేటాయించగా 27264 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. 2024 ఖరీఫ్‌లో 38177 మెట్రిక్ టన్నులకుగాను 28957 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి.

● సరఫరా వివరాలు ఏఓలు, ఏడీఏలకు ఇవ్వని వైనం..!

2014- 2019 టీడీపీ పాలనలో రిటైల్ డీలర్లు, హోల్ సెల్ డీలర్లకు ఎంత మోతాదులో ఎరువులు సరఫరా చేస్తున్నారో ఆ వివరాలను స్థానిక ఏఓ, ఏడీఏలకు అందజేసేవారు. గత వైసీపీ హయాం నుంచి రిటైల్ డీలర్లు, హోల్ సెల్ డీలర్లకు ఎరువుల రకాల వారిగా ఎంత మోతాదులో సరఫరా చేశారన్న వివరాలు ఇవ్వడం ఆపేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలు గడుస్తున్నా అదే పరిస్థితులు కొనసాగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కరువు పరిస్థితుల్లోనూ అదనంగా యూరియా వాడకం ఎలా సాధ్యమన్న చర్చ జోరుగా జరుగుతుండటంతో అక్కడి ఉన్నతాధికారులు అప్రమత్తమైన ట్లు సమాచారం. ఈక్రమంలోనే నాలుగు రోజుల కిందట నుంచి డీలర్లకు సరఫరా చేసిన ఎరువుల వివరాలను స్థానిక ఏఓలు, ఏడీఏలకు పంపినట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఈ నేపథ్యంలోనే ఏఓలు, ఏడీఏలకు యూరియా, ఇతర ఎరువులు ఏఏ డీలర్లకు ఎంత మోతాదులో సరఫరా చేశారన్న వివరాలు అందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సొమ్ము రికవరీ ఏదీ..?

- ఏడాదిన్నరైనా స్పందన కరువు
- రెగ్యులర్ సిబ్బందికి ఇబ్బందులు తప్పవా..?
- అటకెక్కిన అటవీశాఖలో స్వాహా కేసు
- పట్టించుకోని కొత్త అధికారులు



అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో దుర్వినియోగమైన సొమ్ము రికవరీ అటకెక్కిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం రేంజ్ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఆ శాఖ ఖజానాకు చేరాల్సిన సొమ్మును దారి మళ్లించి స్వాహా చేసిన సంఘటన వెలుగుచూసి ఏడాదిన్నర గడిచిపోయింది. దానికి సంబంధించిన రికవరీ విషయంలో పట్టించుకునే వారు లేరనే చర్చ జరుగుతోంది. శాఖ ఖజానాకు చేరాల్సిన సొమ్మును నకిలీ చలానాలతో ఓ కాంట్రాక్ట్ వర్కర్ స్థానిక అధికారుల సహకారంతో స్వాహా చేశాడు. రూ.15 లక్షల సొమ్ము కాజేసినా స్థానిక అధికారులు, అకౌంట్స్ విభాగం, సూపరింటెండెంట్, రేంజ్ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరికి వాటాలు చేరాయన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. సెంట్రల్ ఆడిట్‌లో అడ్డంగా దొరికిపోవడంతో అక్రమార్కుడి బండారం బయటపడింది. దాంతో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఉలిక్కిపడింది. స్వాహా చేసిన వ్యక్తి కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో ఆ సొమ్ముకు రెగ్యులర్ సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఘటనపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులను సైతం స్టేషన్‌కు పిలిపించి అప్పట్లో చర్చించడంతో తిరిగి శాఖకు చెల్లిస్తామని చెప్పుకొచ్చినట్లు ప్రచారం జరిగింది. పోలీసులకు దొరకకుండా అక్రమార్కుడు నేరుగా కోర్టులో హాజరయ్యాడు. విచారణ అనంతరం సెంట్రల్ జైలుకు పంపారు. అప్పటి డీఎఫ్ఓ అక్రమార్కుడి నుంచి సొమ్ము రికవరీ చేసేంత వరకు బెయిల్ ఇవ్వకుండా ప్రయత్నించారు. అనంతరం ఆ శాఖ సిబ్బంది సహకారంతో ఎలాగో బెయిల్ బయటకు వచ్చాడు. అక్రమాలకు పాల్పడిన మాట వాస్తవమేనని, ఆ సొమ్ము చెల్లిస్తానని అటవీశాఖ అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. దీంతో శాఖ అధికారులు సైతం సొమ్ము రికవరీ చేస్తే చాలన్న ఉద్దేశంతో మిన్నకుండిపోయారు. అతడు బయటకు వచ్చిన తరువాత సొమ్ము రికవరీకి సంబంధించి పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. శాఖ సిబ్బంది డీఎఫ్ఓ వద్దకు వచ్చి మాట్లాడాలని అక్రమార్కుడికి చెప్పినా.. కోర్టు ద్వారానే తేల్చుకుంటామని ప్లేటు ఫిరాయించినట్లు తెలిసింది. దీంతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఉన్నతాధికారుల నుంచి ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చిపడుతుందోనని బిక్కు బిక్కు మంటున్నారు. తర్వాత డీఎఫ్ఓ, సీసీఎఫ్ బదిలీపై వెళ్లారు. కొత్త అధికారుల దృష్టికి ఈ సమస్య వెళ్లకుండా కొందరు అధికారులు జాగ్రత్తలు పడుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం రికవరీ చేస్తే సరి..? లేదంటే ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని మదనపడుతున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు దీనిపై దృష్టిసారించ లేదన్న విమర్శలు ఉన్నాయి.

నోరు అదుపులో పెట్టుకోండి..

- మా దృష్టంతా అభివృద్ధివైపే...
- మీపైకి మరల్చేలా చేసుకోవద్దు
- ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్‌కు పరిటాల సునీత హెచ్చరిక



అనంతపురం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడండి... మా దృష్టంతా నియోజకవర్గ అభివృద్ధి వైపే ఉంది... మీపైకి దృష్టి మరల్చేలా చేసుకోవద్ద'ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతపురంలోని తన నివాసంలో ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం మీడియాతో మాట్లాడారు. కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో జరిగిన గొడవను రాజకీయం చేస్తూ తమ కుటుంబంపై విమర్శలు చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనలో రెండు వైపుల వారికి గాయాలయ్యాయన్నారు. దీనిని వైసీపీ దాడిగా తాము ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. గతం నుంచి వారి మధ్య వ్యక్తిగత కారణాలు, మనస్పర్థల నేపథ్యంలోనే గొడవ పడ్డారన్నారు. ఆ ఇద్దరి మధ్య జరిగిన గొడవను తెలుగుదేశం పార్టీకి, పరిటాల కుటుంబానికి ఆపాదిస్తారా అంటూ ఆమె మండిపడ్డారు. 'గత ఐదేళ్లలో మీరు.. ఎంత మందిపై అక్రమ కేసులు పెట్టించారో లెక్కేలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాల'ని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాధవ్‌కు హితవు పలికారు. పోలీసు వ్యవస్థ గురించి ప్రకాష్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని వ్యవస్థల్ని నాశనం చేయడంతోపాటు వాటిని స్వార్థం కోసం వాడుకున్న సంగతి మర్చిపోయారా అని ప్రకాష్‌రెడ్డిని ఆమె నిలదీశారు. ఇప్పుడిప్పుడే నిద్రలేచి ఖబడ్దార్ అంటూ మాధవ్ అరుస్తున్నట్లుగా ఉందన్నారు. గతంలో మీరు చేసిన వాటి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత బాగుంటుందన్నారు. సభ్యత, సంస్కారం ఉంది కాబట్టి చెప్పడం లేదన్నారు. గత ఐదేళ్లలో ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు చేసినా పట్టించుకోకుండా తాము నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టామన్నారు. 'అదే మీరు చేసిన వాటికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆలోచన వచ్చినా.. మీరన్నట్టు రాజకీయంగా చూడాల్సి వస్తే ఆ కథ వేరేలా ఉంటుంద'ని ఆ ఇద్దరు నేతలను ఆమె హెచ్చరించారు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఓ వైపు ప్రకాష్‌రెడ్డి.. మరోవైపు గోరంట్ల మాధవ్ పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. వారిలో వారికే పొసగక అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న ఘటనలు జరిగితే దానికి రాజకీయాల్ని ఆపాదించుకుంటూ అమాయక కార్యకర్తల్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. చిన్న గొడవ జరిగినా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని ఆ ఇద్దరు నేతలకు పరిటాల సునీత హితవు పలికారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

శింగనమల ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజలాలపురం దోణరామేశ్వరుడి కొండపై నుంచి దిగుతున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో నలుగురు భక్తులు గాయపడ్డారు. శింగనమల ఎస్సీ కాలనీకి చెందిన ఆరుగురు భక్తులు ఆటోలో సోమవారం చిన్నజలాలపురం దోణరామేశ్వరుడి కొండమీదకు వెళ్లారు. దర్శనం అనంతరం కొండ మీద నుంచి ఆటోలో వస్తుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఆటో కిందపడ్డంతో అందులో ఉన్న భక్తులు ఆదిలక్ష్మి కాలు నుజ్జునుజ్జు కాగా, గాయత్రి, సేహ్నా, సావిత్రి కి గాయాలయ్యాయి. ఈ మేరకు శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలుసుపై జాగ్రత్త వహించండి

- కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్


చీనీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిమర్రి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చీనీ పంటకు వ్యాపించే పొలుసు పురుగుపై రైతులు జాగ్రత్త వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి వద్ద చీనీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పొలుసు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, ఇది లేత ఇగుర్లు, పూతను దెబ్బతీసిందన్నారు. పురుగుల మందులే కాకుండా పసుపు రంగు చిగురు అట్టలు అమర్చి నివారించుకోవచ్చు అన్నారు. ఇమిడా క్లోప్రిడ్ 0.5ఎంఎల్ లేదా థయోమెతాక్సిన్ 0.3గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలు, మొదళ్ల పైవరకు తడిసేలా పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

5.96 లక్షల మందికి ఆల్బెండజోల్ పంపిణీ

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఒక్కరోజే 5,96,128 మంది పిల్లలకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని వైద్యశాఖ నిర్వహించింది. 6,08,529 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలని వైద్యశాఖ లక్ష్యం పెట్టుకుందని ఆమె తెలిపారు. 97.96 శాతం మాత్రలు వేశామని, మిగిలిన పిల్లలు అందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ వేయిస్తామని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.13



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

'మైనార్టీ' పాలన అస్తవ్యస్తం..!

- ఉమ్మడి జిల్లాకు ఒకే ఏడీ స్థాయి అధికారి
- సిబ్బంది అందరూ అవుట్ సోర్సింగే..
- డీటీలు ముందుకొచ్చినా.. నో పోస్టింగ్
- శ్రీసత్యసాయి జిల్లాలో కార్యాలయమే లేదు
- ఇదీ మైనార్టీ సంక్షేమశాఖ దుస్థితి


మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖకు సిబ్బంది లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మైనార్టీ సంక్షేమ శాఖ కీలకంగా పనిచేస్తుంది. అలాంటి సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లాలో నామమాత్రంగా మారిపోయింది. అనంత జిల్లాలో ఒక్క ఏడీ తప్పా.. ఒక్కరంటే ఒక్కరు కూడా రెగ్యులర్ అధికారి లేరు. అంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే... దీంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. పాలనాపరమైన అంశాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తిస్థాయి అధికారాలు ఉండవు. ఒక్క ఏడీ స్థాయి అధికారే అన్ని పనులు చూసుకోవాల్సి వస్తుండడంతో పాలన ఇబ్బందికరంగా మారింది. సత్యసాయి జిల్లాలో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయమే ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ ఏ కార్యక్రమమైనా అనంత జిల్లా ఏడీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి వస్తోంది. ఆ జిల్లాలోని మైనార్టీలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు అనంతకే రావాల్సి వస్తోంది. రెండు జిల్లా పనులు చూసుకోవాలంటే వారికి తలకుమించిన భారమవుతోంది.

డీటీ స్థాయి అధికారులు ముందుకొచ్చినా..

అనంత జిల్లా కార్యాలయంలో ఏడీ మినహా.. అందరూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే. కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలనాపరమైన అంశాల్లో ఈ పోస్టులు చాలా కీలకం. ఈ పోస్టుల కోసం ఇప్పటికే ధర్మవరం, కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు ఫైళ్లను అనంత మైనార్టీ శాఖకు పంపినట్లు సమాచారం. వారి ఫైళ్లను పరిశీలించిన మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు కలెక్టర్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ అధికారుల నియామకం చేపట్టలేదు.

ప్రొటోకాల్, వేడుకల నిర్వహణలో సమస్య

సత్యసాయి జిల్లాలో మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం లేకపోవడం పలు సందర్భాల్లో సమస్యగా మారుతోంది. కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచి కార్యాలయం, అధికారుల నియామకం చేయాలని రాష్ట్రశాఖకు.. ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆ శాఖ మంత్రుల పర్యటన, అధికారిక కార్యక్రమాల నిర్వహణ సమయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత సంవత్సరం డిసెంబరు నెలలో ఏపీ మైనార్టీ అఫైర్స్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఆయన పెనుకొండలో పర్యటించినప్పుడు ప్రొటోకాల్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపించింది. ముందస్తు క్రిస్మస్, రంజాన్ వేడుకల నిర్వహణ సమయంలోనూ రెండు జిల్లాల్లో అవే సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అస్తవ్యస్తమైన మైనార్టీ శాఖను గాడిలో పెట్టాలని ఆ వర్గ ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

శివపార్వతుల గ్రామోత్సవం

గార్లదిన్నె, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాఘమాసం రెండో సోమవారం సందర్భంగా మండల కేంద్రంలో శివ మాలధారుల ఆధ్వర్యంలో శివపార్వతుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి శివాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. సోమవారం ఉదయం శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శివలింగాన్ని, శివపార్వతుల విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీసుకున్నారు.

ప్రతి రైతు కొత్త ఐడీ కలిగి ఉండాలి : ఏఓ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడెంటిఫికేషన్ నంబరు కలిగి ఉండాలని మండల వ్యవసాయధికారి శశికళ పేర్కొన్నారు. ఆ ఐడీతోనే పంటనమోదు చేయించుకోవాలన్నారు. ఈ ఐడీ నంబరు కోసం రైతు సేవాకేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందిని కలసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

హామీలను అమలు చేయాలి: సీపీఐ

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ రాప్తాడు నియోజకవర్గం కార్యవర్గ సమావేశాన్ని నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, రూరల్ మండల కార్యదర్శి రమేష్, ఆత్మకూరు మండల కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఆత్మకూరు మండల సహాయకార్యదర్శి శివ, నాయకులు ధనుంజయ, శారద, దుర్గాప్రసాద్, అజయ్, కుళ్లాయప్ప, రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

నియామకం


సంతోష్‌కుమార్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తనను రాష్ట్ర నాయకత్వం నియమించినట్లు సంతోష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పనిచేస్తున్నానని, గత 13 ఏళ్లుగా నిరుద్యోగుల సమస్యలపై అనేక ప్రజా సమస్యలపై పోరాడుతున్నానని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 8 వరకు జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శిగా తనకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని వేధించిన వంశీ అనే వ్యక్తిపై ఇటుకలపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి ఎస్సీకాలనీకి చెందిన కడప శిరీష ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన వంశీపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. కాగా వంశీని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చీటింగ్ కేసు..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. రాణినగర్‌కు చెందిన విశ్వనాథ్‌కుమార్ టైర్ల వ్యాపారం చేస్తుంటాడు. సంఘమేష్ సర్కిల్‌కు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తికి 2023లో రూ.2.12లక్షల విలువైన టైర్లు ఇచ్చాడు. ఆ సమయంలో ఇమ్రాన్ ఇచ్చిన చెక్‌ను బ్యాంకులో చూపించగా డబ్బు లేదని చెప్పారు. ఇప్పటికీ డబ్బు ఇవ్వకపోవడంతో సోమవారం విశ్వనాథకుమార్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇమ్రాన్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యపై..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామం సమీపంలో నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న అభిలాష్ మృతిపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కదిరి మండలం నడింపల్లికి చెందిన మహేంద్ర కుమారుడు అభిలాష్ నగరంలోని సాయినగర్‌లో ఉంటూ ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలో పనిచేసేవాడు. తల్లిదండ్రులు కొంతకాలంగా అతడి వద్దే ఉంటున్నారు. అభిలాష్ ఆ ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ అమ్మాయిది ఆదివారం నిశ్చితార్థం జరిగింది. దీంతో అతడు శిల్పారామం వద్దకెళ్లి పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఎన్ఆర్ కాలనీకి చెందిన అరుణలక్ష్మి(42) ఆత్మహత్యకు పాల్పడింది. ఆటోడ్రైవర్ శ్రీనివాసులు, అరుణలక్ష్మి దంపతులు ఎన్ఆర్ కాలనీలో నివాసముంటున్నారు. వారికి పెళ్లయి 15 ఏళ్లయింది. సంతానంలేదు. ఏడాది నుంచి ఆమెను టీబీ వేధించేది. ఈ క్రమంలో మనస్తాపంతో సోమవారం అరుణలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ చోరీ

శింగనమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో పంచాయతీకి తాగునీటి బోర్ల మోటార్ల కేబుల్ ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పంచాయతీకి చెందిన చాకిరేవు గుట్ట వద్ద ఉన్న మోటారు, దుర్గాంజనేయస్వామి కొండ వద్ద ఉన్న మరో మోటారుకు చెందిన 150 మీటర్ల కేబుల్ ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని సర్పంచ్ నాగమునెమ్మ తెలిపారు.

దుకాణానికి నిప్పు

గార్లదిన్నె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కిరాణ దుకాణం నిర్వహిస్తున్న బంకుకు ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో రూ. లక్ష ఆస్తి నష్ట వాటిల్లినట్లు బాధితులు గౌసియా తెలిపారు. పోలీస్‌స్టేషన్ వెనుకవైపు గౌసియా, రహంతుల్లా దంపతులు చిన్న బంకులో కిరాణకొట్టు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద వ్యాపించాయి. గమనించిన రహంతుల్లా, గౌసియా చు ట్టు పక్కల వారి సాయంతో ఆర్పేశారు. అప్పటికే బంకు పూర్తిగా కాలిపోయింది. అందులోని సరుకులు, రూ. 10వేల నగదు కాలిపోవడంతో సుమారు రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవే దన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి

రాప్తాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ (39) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. రాప్తాడుకు చెందిన గవ్వల పరంధామ 2014 నుంచి 2019 వరకు వైస్ ఎంపీపీగా ఉన్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యులు సోమవారం ఉదయం గుర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాప్తాడు గ్రామానికి వచ్చి గవ్వల పరందామ మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వామ్మో చిరుతలు..!

- శింగనమల మండలంలో పెరిగిన సంచారం
- గొర్రెలపై వరుస దాడులు
- హడలెత్తుతున్న కాపరులు, రైతులు


చిరుత దాడిలో గాయపడిన గొర్రె


గతనెల 11న మృతిచెందిన గొర్రెలు

శింగనమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతల సంచారం పెరిగింది. కొండ ప్రాంతాల్లో చిరుతలు.. మూగజీవాలపై దాడులు చేసి, చంపుతున్నాయి. దీంతో రైతులు, గొర్రెల కాపర్లు.. మూగజీవాలను కొండ ప్రాంతాలకు మేత కోసం తీసుకెళ్లాలంటే హడలిపోతున్నారు. ఈనెల 6న గోవిందరాయునిపేట సమీపంలోని మాల కొండ వద్ద ఎద్దుల సూరికి చెందిన గొర్రెల మందపై రెండు చిరుతలు దాడి చేశాయి. రెండు గొర్రెలను చంపేశారు. మరొక గొర్రె గాయపడింది. తరిమెల, గుమ్మేపల్లి, ఆనందరావుపేట, పెద్దమట్లగొంది, వెస్టునరసాపురం, నాగులగుడ్డం తండా గ్రామాల పరిధి గంపమల్లయ్య అటవీ, కొండ ప్రాంతాలు, శింగనమల, చిన్నజలాలపురం, గోవిందరాయునిపేట సమీపంలోని మాలకొండ, పెద్దకుంట, కల్లుగొంది తదితర ప్రాంతాల్లో చిరుతల సంచారం అధికంగా ఉన్నట్లు గొర్రెల కాపర్లు చెపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒకచోట మూగజీవా లపై దాడి చేస్తున్నాయి.మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో దాహం తీర్చుకునేందుకు శింగనమల చెరువు వద్దకు వస్తున్నాయి. చిరుతలు కనిపిస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు.. చిరుతలను పట్టుకోవాలని రైతులు, గొర్రెల కాపర్ల కోరుతున్నారు.

నెలలోనే ఆరు గొర్రెలను చంపేశాయి



నాకు 150 గొర్రెలు ఉన్నాయి. గోవిందరాయుని పేట గ్రామం సమీపంలో మంద వేస్తాను. సమీపంలోనే ఉన్న మాలకొండలో చిరుతలు సంచరిస్తున్నాయి. గతనెల 11న మందపై చిరుతలు దాడి చేయడంతో అక్కడికక్కడే మూడు గొర్రెలు చనిపోయాయి. గాయపడిన ఒక గొర్రె మరుసటి రోజు చనిపోయింది. ఈనెల 6న మధ్యాహ్నం మాల కొండ కింద రెండు చిరతలు.. మందపై దాడి చేయడంతో అక్కడికక్కడే రెండు గొర్రెలు చనిపోయాయి. మరొకటి గాయపడింది. గత నాలుగేళ్లలో చిరుతల దాడిలో 20 గొర్రెలుపైగా నష్టపోయా. ఇప్పటికైనా అధికారులు.. చిరుతలను బంధించాలి.

-ఎద్దుల సూరి, కాపరి, గోవిందరాయునిపేట

రూ. 3కోట్ల బిల్లులు చెల్లించాలి

- పీజీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేకి కాంట్రాక్టర్ల వినతి


ఎమ్మెల్యే దగ్గుపాటికి వివరిస్తున్న కాంట్రాక్టర్లు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో చేసిన పనులకు బిల్లులు రాలేదని, రూ.3కోట్ల బిల్లుల పరిస్థితి సందిగ్ధంలో ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కాంట్రాక్టర్లు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నగర కమిషనర్ బాలస్వామి వినతులు స్వీకరించారు. కాంట్రాక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు ఎమ్మెల్యేని కలిసి విన్నవించారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి అన్ని మున్సిపల్ ఖాతాలలో డబ్బులుండేవని, ఆ డబ్బు అంతా వెనక్కు పంపాలని గత వైసీపీ ప్రభుత్వ హయంలో ఆదేశా లందాయన్నారు. అన్ని మున్సిపాలిటీలలో బిల్లులు క్లియర్ చేసి పంపారని, అనంతపురం నగరపాలక సంస్థలో 18బిల్లులకు సంబంధించి రూ.3కోట్ల వరకు బిల్లులు క్లియర్ చేయకుండా మొత్తం రూ.12కోట్లు వెనక్కు పంపారని వారు పేర్కొన్నారు. ఏడాదిన్నరగా బిల్లుల సమస్య ఉందని, త్వరగా పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేని కోరారు.

అమ్మవారి వంకలో ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

నగరంలోని మరువవంకకు కలిసే అశోక్‌నగర్‌లోని అమ్మవారి వంకపై ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి వెంకటరామయ్య ఎమ్మెల్యేని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేకుండా అశోక్‌నగర్ ప్రధాన రహదారిలో వంకపై బ్రిడ్జి నిర్మించారని, దీంతో జీరో క్రాస్ రోడ్డు పూర్తిగా కనుమరుగై రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోందన్నారు.వంక చుట్టూ కట్టిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే

నగరపాలిక పరిధిలో కార్పొరేషన్ స్థలాలను కబ్జా చేసే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. స్థానిక సమస్యలపై పలురు వినతి పత్రాలు అందజేశాన్నారు. సెంట్రల్ పార్క్‌లో సర్వే చేపట్టి, ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ప్రసన్నాయపల్లి వద్ద 20 ఎకరాల స్థలం కబ్జాకు గురైందని, తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆగిన పనులను ప్రారంభించండి: మేయర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో టెండరు ప్రక్రియతో ఆగిపోయిన అన్ని పనులు ప్రారంభమయ్యేలా చూడాలని నగర మేయర్ మహమ్మద్ వసీం కమిషనర్ బాలస్వామికి సూచించారు. మేయర్ సోమవారం తన చాంబర్‌లో కమిషనర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. నగరంలో చాలా పనులకు టెండర్లు పిలిచారని, కానీ పనులు ప్రారంభించలేదన్నారు. వెంటనే వాటిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో మరిన్ని వీధిలైట్లు ఏర్పాటు చేసి చీకట్లు తొలగించాలన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు విభాగాల అధికారులు సిద్ధం చేసేలా ఆదేశాలివ్వాలని సూచించారు.

బేవరేజెస్‌ను ప్రభుత్వ గోదాములోకి మార్చాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ గోదాములు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచు కోవడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. బేవరేజెస్‌ను వెంటనే ప్రభుత్వ గోదాములకు మార్చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాల యంలో నిర్వహించి నవిలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాదాపు ఆరేళ్ల నుంచి బేవరేజెస్ అధికారులు అద్దె గోదాముల్లోనే మద్యాన్ని నిల్వ చేస్తున్నా రన్నారు. దీంతో ప్రతినెలా ప్రభుత్వ ఖజానాకు లక్ష రూపాయల భారం పడుతోందని పేర్కొన్నారు. అధునాతన సౌకర్యాలతో నిర్మించిన గోదాములను ఇప్పటికీ ప్రారం భించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు.

'మానవతావాది దండు నగేష్'


దండు నగేష్‌ను సత్కరిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలతో మానవ సత్సం బంధాలను నెలకొల్పిన మానవతా వాది ఎస్ఐ దండు నగేష్ అని చెరువుకట్ట షిర్డీ సాయిబాబా ఆలయ గౌరవాధ్యక్షుడు విజయనాథ్, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇంటిలిజెన్స్ ఎస్ఐగా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన దండు నగేష్‌కు సోమవారం సాయంత్రం చెరువుకట్ట షిర్డీసాయిబాబా ఆలయం ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. పూల మాలలు వేసి అభినందన పత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓవైపు పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తూనే ఆధ్యాత్మిక, సేవారంగాల్లో నగేష్ చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిన్ని నాగరత్నం, మారడుగు సంతోష్, గర్జాల నాగరాజు, విశ్రాంత తెలుగు పండిట్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించండి: జేసీ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 405 అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం జిల్లా కోపరేటివ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోపరేటివ్స్ బిల్డ్ఏ బెటర్ వరల్డ్ అనే పోస్టర్లు ఆవిష్కరించారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి: ఎస్ఈ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగుల పరస్పర సహకారంతోనే జలవనరుల శాఖలో నిర్మాణాలు, పనుల పురోగతి సాధ్యమవుతుందని హంద్రీనీవా సుజలస్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్‌కు సోమవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏపీ ఎ న్జీఓ నగర, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, మహ బూబ్‌దౌలా, హంద్రీనీవా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ బీఈ6 అండ్ ఎక్స్ఈవీ9ఈ


ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేస్తున్న ఎంజీబీ మొబైల్స్ సీఈఓ, కస్టమర్లు

అనంతసపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రుద్రంపేట సమీపంలో హైదరాబాదు-బెంగుళూరు పక్కనున్న ఎంజీబీ మొబైల్స్ మహీంద్రా షోరూం ఆధ్వర్యంలో మహీంద్ర న్యూ ఎలెక్ట్రిక్ బీఈ6 అండ్ ఎక్స్ఈవీ9ఈ వాహనాన్ని సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కస్టమర్లతో జ్యోతి ప్రజ్వలన చేసి వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్యా మాచాని మాట్లాడుతూ.. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంలో మహీంద్రా ఏఐ ఆర్కిటెక్చర్, 100 సీఎం వైడ్ సినిమా స్కోప్ డిస్‌ప్లే కలిగిన లగ్జరీ, జెడ్ క్లాస్ సెక్యూరిటీతో ఐదు కెమెరాలు ఉన్నాయన్నారు. ఆటో పార్కింగ్ సౌకర్యం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకారం జీరో శాతం లైఫ్‌ట్యాక్స్ ఎనిమిది ఆకర్షణీయమైన రంగుల్లో అందుబాటులోకి వచ్చిందన్నారు. కారు ఎక్స్ షోరూం ధర రూ.18.9లక్షల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచన


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పారదర్శకత పాటిస్తూ ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీతో పాటు, అనంతపురం ఆర్డీఓ కేశవులునాయుడు, మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వివరించారు. ప్రధానంగా భూ సమస్యలు, భూ రీసర్వే సమస్యపై ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. వీటితో పాటు దండువారిపల్లి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దండువారిపల్లి చెరువుకు నీరు విడుదల చేయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. బుక్కరాయసముద్రం పంచాయతీలోని పది కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని కోరారు. సర్వే నంబరు 539-2, 540-2లో ఉన్న 71 సెంట్ల స్థలాన్ని వెంటనే అంబేద్కర్ స్మారక భవనానికి కేటాంచాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఓ నల్లప్ప తదితరులు ఎమ్మెల్యేని కోరారు. మొత్తంగా ఈ ప్రజావేదికలో మండలంలోని 417 మంది వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే శ్రావణీశ్రీ తెలిపారు.

ప్రజల వద్దకే... కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు ప్రజల వద్దకే వచ్చి పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అన్నారు. ప్రజావేదిక ద్వారా ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలన్నిటినీ సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంపీపీ సునీత, కన్వీనర్ అశోక్, టీడీపీ జిల్లా నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, కేశన్న, రవీంద్ర, లక్ష్మీ నారాయణ, ఎస్ నారాయణస్వామి, ఓబులపతి, జొన్నారామయ్య, పెద్దప్ప, సోమశేఖర్, ఆదేప్ప, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై పిల్లలకు వివరించాలి

- నులిపురుగుల నివారణ దినంలో ఎమ్మెల్యే దగ్గుపాటి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పరిశుభ్రత, ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. స్థానిక శారదా మున్సిపల్ స్కూల్ లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్స వాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల సంక్షేమం, చదువు కోసం ఎంతో ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పలువురు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, నగర కమిషనర్ బాలస్వామి, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, డీఈఓ ప్రసాద్‌బాబు, సీడీపీఓ లలిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

గార్లదిన్నె, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని వైద్యాధికారి గౌతమి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల కు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ యోగానంద రెడ్డి, ఎంఈఓ తారాచంద్రానాయక్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి : ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరానికి దీటుగా నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ విశ్వశాంతి నగర్‌లో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డుకు ఆయన సోమవారం భూమి పూజ చేసి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు పంచాయతీల్లో రూ. 6కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని పూర్తి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, నాయకులు భక్తవత్సల నాయుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బోయపాటి బాలప్ప, పంచాయతీ అధ్యక్షుడు ఎస్ఎం భాష, మారుతికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎక్స్‌పోకు విశేష జనాదరణ



భారత్ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎక్స్‌పో

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండు మైదానంలో ఏర్పాటు చేసిన భారత్ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎక్స్‌పో-2025కు విశేష జనాదరణ లభిస్తోందని ఎక్స్‌పో నిర్వాహకుడు ఫక్రుద్దీన్ సోమవారం వెల్లడించారు. ఎక్స్‌పోలో జ్యూయలరీ, విభిన్న రకాల షత్రంజిలు, బనారస్, చాందినీ చీరలు, పెయింటింగ్స్, కుర్తాలు, కార్పెట్లు, ముత్యాలు, వెస్ట్ బెంగాల్, కలకత్తా చీరలు, కాశ్మీరి డ్రెస్ మెటీరియల్స్, భాగల్పూర్ సిల్క్స్, డ్రెస్ మెటీరియల్స్ దొరుకుతాయన్నారు. అలాగే రాజస్థానీ గాజులు, టెర్రాకోట ఉడెన్ ఫర్నిచర్, ఇలా అనేక రకాల హ్యాండీక్రాఫ్ట్, హ్యాండ్లూమ్స్ మెటీరియల్‌ను అనంతవాసుల కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పిల్లల కోసం కిడ్స్ జోన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఎక్స్‌పో ప్రదర్శన ఉంటుందన్నారు. ఎక్స్‌పో ఈ నెల 16 నాటికి ముగుస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14 నుంచి బడ్జెట్‌పై సదస్సులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై ఈనెల 14వ తేదీ నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా వారం రోజులపాటు యూనివర్సిటీలు, కళాశాలలు, గ్రామీణ, పట్టణాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ బడ్జెట్‌లో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండేలా నిర్ణయాలున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్ష నాయకులు మల్లికార్జున, లింగమయ్య, కేశవరెడ్డి, శ్రీరాములు, అల్లిపీరా, బాలరంగయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

బాలికలకు రక్షణగా చట్టాలు : ఐసీడీఎస్ పీడీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బాలికలకు రక్షణగా ప్రభుత్వ చట్టాలున్నాయని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వనజ అక్కమ్మ తెలిపారు. జేఎన్టీయూ ఓటీపీఆర్ఐ కళాశాలలో సోమవారం 'ఉద్యోగాలు నిర్వహించే ప్రదేశాల్లో పిల్లల భద్రత' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రొఫెసర్ చిత్ర అధ్యక్షతన ఏర్పాటుచేసిన వర్క్‌షాపునకు వనజ అక్కమ్మతో పాటు న్యాయ సలహాదారు నర్మద, వన్‌స్టాప్ కేంద్రం మేనేజర్ శాంతమణి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ గోపినాథ్, డీఆర్ దుర్గాప్రసాద్, ఎన్ఎస్ ఎస్ పీఓ లహరి, అధ్యాపకులు ప్రణతి, యామిని తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కారానికి తగిన చొరవ తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి సూచించారు. స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వేరువేరుగా పజలకు సంబందించిన పలు సమస్యలపై సోమవారం ఆయన అధికారులతో చర్చించారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, రామకృష్ణారెడ్డి, ముత్యాలప్ప పాల్గొన్నారు.

13న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థాని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ ఉద్యోగాలకు ఈనెల 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ కవితాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

మెకానికల్ ఇంజనీరింగ్‌తో విరివిగా ఉద్యోగాలు

- కియ అసిస్టెంట్ మేనేజర్ అశోక్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు విరివిగా ఉద్యోగాలు లభిస్తున్నాయని కియ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ అశోక్ పేర్కొన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కళ్యాణి రాధ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ మెకానికల్ ఇంజనీర్ కెరీర్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు వివరించారు. సీనియర్ ప్రొఫెసర్లు హేమచంద్రారెడ్డి, శ్రీనివాసన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఓంప్రకాష్, పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అశోక్‌ను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కుందుర్పి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కనుసయ్య గుట్ట కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ఆ కాలనీ మహిళలు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదు ట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గత రెండు నెలలుగా తాగునీటి సమస్య నెలకొందని, గుక్కెడు నీరు కూడా దొరక్కపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్య తెలిసినా సర్పంచ్, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మీశంకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలను సీజ్ చేయాలంటూ ఆందోళన

ఉరవకొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం సమీపంలో ఉన్న ఎడిషన్ స్కూల్‌ను సీజ్ చేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నజీరియా బేగంతో విద్యార్థుల తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. అపార్ కోసం విద్యార్థుల ఆధార్‌లో తప్పబడ్డ పేర్లను రికార్డుల ప్రకారం సరిచేయాలని కోరుతున్నా.. పాఠశాలలో రికార్డులు లేవని చెప్పడం విడ్డూరమన్నారు. స్కూల్‌లో రికార్డులు లేకపోతే పాఠశాలను ఎందుకు నిర్వహిస్తున్నారని నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని వాపోయారు. పాఠశాల వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు.. విద్యార్థుల తల్లిదండ్రులకు సర్దిచెప్పారు. దీంతో వారు ఎంఆర్‌సీకిచేరుకుని ధర్నా నిర్వహించారు. విషయాన్ని డిప్యూటీ డీఈవో దృష్టికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ డీఈఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమిచ్చారు.

అవినీతిపరుల నుంచి సొమ్ము రికవరీ చేయాలి

విడపనకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో అవినీకి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి నుంచి సొమ్మును రికవరీ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు(సీపీఐ) ఎంబీ చెన్నరాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి పథకంలో దాదాపుగా రూ.11 కోట్ల పనులు జరిగితే.. వాటిలో రూ.1.5కోటికి పైగా అధికారులు అవినీతి పాల్పడ్డారన్నారు. వారిని వెంటనే సస్పెండ్ చేసి సొమ్మును రికవరీ చేయాలన్నారు. ఎనిమిది సిబ్బందితో పాటు 2023-2024లో విధుల్లో ఉన్న ఎంపీడీఓపై, ఏఈ పై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇలాంటివి ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అవినీతి సొమ్మును రికవరీ చేయక పోతే కూలీల చేత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కుందుర్పి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన శేఖర్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. శేఖర్ తన కులవృత్తి అయిన ఉరాల వాయిద్యంతో పాటు కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. కాగా కొన్ని నెలల నుంచి పనులు లేకపోవడంతో ఇంటి దగ్గరే వుండేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసై అధిక అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం మనస్థాపానికి గురై ఇంట్లోనే బాత్రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా.. విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం ఆస్పత్రికి నిమిత్తం తరలించారు.

రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలి: సీపీఎం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని పట్టణంలోని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఏవేని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే భారం పడిందని అన్నారు. వెంటనే రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇతర చోటకు మార్చరాదని కోరారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చంద్రశేఖర్, రామునాయక్, షబ్బీర్, మక్బుల్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికులకు ఇంక్రిమెంట్, అరియర్స్ చెల్లించాలన్నారు. 60సంవత్సరాలు పూర్తయిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు, రిటైర్డ్ అయి మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ ఆఫీసులోనే పరిష్కరించి రావాలసిన బెనిఫిట్స్‌ను ఇప్పించాలన్నారు. సమస్యలను ఈనెల 22తేదీలోపు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాయీం అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ ప్రధానకార్యదర్శి సాకే నాగరాజు, అధ్యక్షుడు జగదీష్, నాయకులు నరసయ్య, బాషా, రంగనాయకులు, రవి, ఏఐటీయూసీ పట్టణ ప్రధానకార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పామిడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏఓ లీనావసుంధర, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ... కందులను క్వింటా రూ.7550 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 214 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, సర్పంచు సుశీలమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్, టీడీపీ మండల కన్వీనర్ మునలిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో అన్ని రకాల సరుకులు ఇవ్వాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చౌకధాన్యపు డిపోలలో అని రకాల సరుకులను పేదలకు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దారు రమాదేవికి సోమవారం ఐద్వా నాయకురాళ్లు వినతి పత్రం అందజేశారు. ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, నాయకురాళ్లు లక్ష్మీబాయి, షాకీర, సరస్వతి, లక్ష్మి, మహాలక్ష్మి, రూతమ్మ, లక్ష్మీనరసమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన పట్టాభిరాముడు

- పెద్దఎత్తున పాల్గొన్న భక్త జనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోట వీధిలో పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గరుడ వాహన సేవను కన్నుల పండువగా జరిపారు. ఉదయమే అర్చకులు ఆలయంలో సామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచిపురవీధుల్లో ఊరేగింపు చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలలో ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలువురు చిన్నారులు కోలాటం ఆడారు. యువకుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ రవిబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు


ఊరేగింపులో ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల వేషధారులు

ఉత్సవాల పర్యవేక్షణ

కళ్యాణదుర్గం: పట్టణంలోని పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆ ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలను దేవినేని అవినాశ్ సోమవారం ఉదయం పర్యవేక్షించారు. ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న ముగ్గుల పోటీలను పరిశీలించారు. అనంతరం గరుడ వాహనానికి పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలకు స్థానిక మహీంద్రా వినాయక షోరూం యజమానులు రూ. 20,116లు, కోనంకి అమరబిందు రాజశేఖర్ రూ. 10,116ల చెక్కులను దేవినేని అవినాశ్‌కు అందజేశారు. తర్వాత ఆయన్ను టీడీపీ నాయకులు శాలువాతో సన్మానించారు.


గరుడోత్సవాన్ని ప్రారంభించేందుకు వెళ్తున్న ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ తదితరులు

పట్టాభి రాముడి ఆలయానికి భారీ గంట సమర్పణ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కోటలో గల పట్టాభి రాముడి ఆలయానికి బెంగళూరుకు చెందిన రాజేంద్రనాయుడు అనే భక్తుడు 40 కిలోల భారీ గంట ను, రెండు పెద్ద చేతి గంటలను సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు వాటిని అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఆ గంటలను పల్లకిలో ఊరేగించి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు చొరవతో వాటిని ఆలయానికి సమర్పించినట్లు దాత తెలిపారు. తర్వాత స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా సోమవారం పిల్లలకు ఊరూరా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అలాగే బెళుగుప్పలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మల్లారెడ్డి, వజ్రకరూరు మండలం చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జగదీష్, ఉరవకొండ మండలం రాకెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యుడు వెంకటేశ్ యాడికి పీహెచ్‌సీలో వైద్యుడు పరమేశ్వర్, బ్రహ్మసముద్రం కేజీబీవీలో వైద్యుడు రాజేష్‌కుమార్, బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలోని పాఠశాలల్లో వైద్యాధికారిగీతాభార్గవి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.


తాడిపత్రిలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

బుగ్గ రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి,ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో ప్రసిద్ధి చెందిన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజల్ని ఘనంగా నిర్వహించారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాయదుర్గం: పట్టణంలోని జంబుకేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు ఖర్జూరాల అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయ మే సుప్రభాతసేవ చేసి పంచామృతాభిషేకం చేసి ఖర్జూరాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. స్వామిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలో గల చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు శివలింగానికి పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేకపూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివవచ్చారు.


తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు

గ్రామాల్లో సమస్యల్ని త్వరగా పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి సూచన

తాడిపత్రి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. అందులో ప్రజలు వివిధ సమస్యల్ని విన్నవించగా... ఆయన స్పందించి సత్వరమే వాటికి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. తొలుత వెంకటాంపల్లిలో పర్యటించగా.. విద్యుత్ సమస్య ఎక్కువగా ఉందని, వాటివల్ల ఇబ్బంది పడుతున్నామని, విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే కొందరు వృద్ధులు తమకు పింఛన్ రాలేదని తెలిపారు. దీంతో ఆయన మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఇక అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందేలా చూడాలని సంబంధితాధికారులకు సూచించారు. అనంతరం బ్రాహ్మణపల్లికి వెళ్లగా.. అక్కడ కొత్తఊరు, పాత ఊరు మధ్యలో వంక ఉందని, వర్షాకాలం వస్తే విద్యార్థులు, ప్రజలు రైతులు అందులో వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని. అక్కడ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. అదేవిధంగా ఇగుడూరు నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వరకు రోడ్డు ఏర్పాటుచేయాలని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జికి ఎస్టిమేషన్ వేయాలని అధికారులకు సూచించారు. ఇగుడూరు నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వరకు రోడ్డుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు. త్వరలో రోడ్డును ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, సత్య, సుదర్శన్‌రెడ్డి, సురేష్, ఓబులేసు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు

కణేకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా స్థలం కోసం సోమవారం అధికారులు పలుచోట్ల పరిశీలన చేశారు. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద, కణేకల్లు క్రాసింగ్ వద్ద పలు స్థలాలను పరిశీలించారు. భవనాల నిర్మాణం పూర్తి అయ్యేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నందున వచ్చే విద్యాసంవత్సరంలో డిగ్రీ కళాశాలను ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాలను పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు జయరామిరెడ్డి, రఘురామమూర్తి, కణేకల్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, వీఆర్వో రుద్రతో పాటు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు పీడీలు..

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలు ఎం.తబిత, వేణుగోపాల్ ఎంపికయ్యారు. గత మూడు రోజులుగా అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. తబిత 50సంవత్సరాల విభాగం షార్ట్ పుట్ పోటీలో పాల్గొని ప్రథమ స్థానం, హ్యామర్ త్రోలో ప్రథమస్థానం, వంద మీటర్లలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వేణుగోపాల్ 55సంవత్సరాల విభాగంలో 4X100మీటర్ల రిలేలో ద్వితీయస్థానం, జావెలిన్ త్రో పోటీల్లో తృతీయస్థానంలో నిలిచారు. వచ్చేనెల మొదటి వారంలో బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


జాతీయ పోటీలకు ఎంపికైన పీడీలు

మండపం నిర్మాణానికి భూమిపూజ

గుత్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బండగేరిలో పులగుట్ట ఆంజనేయస్వామి ఆలయ మండపం నిర్మాణానికి సోమవారం భూమిపూజ జరిగింది. టీడీపీ పట్టణ కన్వీనర్ ఎంకే చౌదరి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. నాయకులు పిల్లెల కృష్ణయ్య, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ కానుకల్ని సోమవారం ఆలయ అధికారులు లెక్కించారు. మాఘమాసం రెండో ఆదివారం తిరుణాల పూర్తికావడంతో హుండీల్లో భక్తులు వేసిన కానుకల్ని లెక్కింపు చేశారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.6,14,898, శాశ్వత హుండీ నుంచి రూ.3,96,817, శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,73,340, తలనీలాల ద్వారా రూ.17,650, విరాళాల ద్వారా రూ.15,499, అభిషేకం టికెట్ల నుంచి రూ.1000 చొప్పున మొత్తం రూ.12,19,204 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

పుట్లూరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): తన భర్త సోహెల్ వరకట్నం కోసం వేధిస్తున్నాడని మండలంలోని ఎస్. వెంగన్నపల్లి గ్రామానికి వేదవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పామిడికి చెందిన సోహెల్ వెంగన్నపల్లికి చెందిన వేదవతి ఏడాదిన్నర క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొద్దిరోజుల నుంచి సోహెల్ భార్యను రోజూ వరకట్నం కోసం వేధిస్తున్నాడు. ఆ వేధింపులు తాళలేక ఆమె మండలకేంద్రంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాడిపత్రి/యాడికి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ సాయిప్రసాద్ సూచించారు. పట్టణ సమీపంలోని సర్‌సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఫేక్‌లోన్‌యాప్స్, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చే వీడియో కాల్స్ తదితర వాటి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి యాప్‌ల భారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్‌నేరాలను అరికట్టేందుకుగాను విద్యార్థులు వలంటీర్లుగా రిజిస్టర్ చేసుకొని ప్రజలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే యాడికి మం డలకేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరా లు, నియంత్రణపై విద్యార్థులకు ఏఎస్ఐ వెంకటేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రి న్సిపాల్ హరినాథ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లొంగిపోయిన నిందితుడు

ఉరవకొండ, ఫిబ్రవరి 10: పట్టణంలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ కేసులో నిందితుడిగా ఉన్న చంద్రశేఖర్ సోమవారం స్థానిక కోర్టులో లొంగిపోయాడు. దీంతో మేజిస్ట్రేట్ ఆయనకు ఈ నెల 24 తేదీ వరకూ రిమాండ్‌కు అదేశించినట్లు సమాచారం. కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో కొద్దిరోజుల క్రితం 1,158 గ్రాముల బంగారం మాయమైన విషయం తెల్సిందే. దీనిపై రీజినల్ ప్రాజెక్టు హెడ్ తిరుపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గత నెల 26 తేదీన ఐదుగురుపై కేసు నమోదు చేశారు. వారిలో చంద్రశేఖర్ కోర్టులో లొంగిపోయాడు. ఈ కేసులో అతడితో పాటు ప్రశాంత్ కుమార్, వెంకటేశులు, రామాంజనేయుల, గురునాథ్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

యాడికి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందిన సంఘటన సోమవారం మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో జరిగింది. పాఠశాల సమీపంలోని పంట పొలాల్లో నుంచి జింక రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో జింక అక్కడే చనిపోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు.

50 లీటర్ల నాటుసారా స్వాధీనం

గుంతకల్లుటౌన్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎక్సైజ్ పోలీసులు 50లీటర్ల నాటు సారాను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ తన సిబ్బందితో మండలంలోని కదిరిపల్లి గ్రామ శివారులోని వంక వద్ద నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఇందులో 300లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే పట్టణంలో 50లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బొలికొండ రంగనాథుడికి గరుడసేవ

గుత్తిరూరల్ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు గరుడవాహనంపై ఊరేగారు. వేకువజామునే అర్చకులు ఆలయంలో స్వామి వారికి పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరించి హనుమంత వాహనంపై ఉంచి పురవీధుల్లో మేళాతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం పల్లకిలో ఉంచి స్థానిక జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. ఈఓ రామాంజనేయులు ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు చేతన్‌వర్మ, రవిస్వామి, రాఘవేంద్రచార్యులు, లికిల్‌వర్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


గరుడవాహంనపై ఊరేగుతున్న స్వామివారు

14 నుంచి ఆంజనేయస్వామి తిరునాళ్ల

బెళుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరంలో గల బూదిగుమ్మ ఆంజనేయస్వామి తిరుణాళ్లను ఈ నెల 14 నుంచి 16 వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వున్న ఈ ఆలయం వద్ద ప్రతియేటా మాఘమాసంలో మూడు రోజుల పాటు తిరుణాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 14న స్వామికి ప్రత్యేక పూజలు, 15న రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16న ప్రాతఃకాల పూజతో తిరుణాళ ముగుస్తుందన్నారు. వేలాదిగా భక్తులు తరలి రానున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యర్రిస్వామి, కార్యనిర్వాహకాధికారి అంకిరెడ్డి తెలిపారు.


ఆంజనేయస్వామి మూలవిరాట్

పనులు చేసినా.. కొలతలు వేయలేదు..

- ఉపాధి కూలీల ఆవేదన

కూడేరు, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు చేసి మూడు వారాలు గడుస్తున్నా కొలతలు వేసి బిల్లులు పెట్టలేదని మండలకేంద్రంలోని కూలీలు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. పని చేసిన ప్రతి వారం టెక్నికల్ అసిస్టెంటు కొలతలు వేసి బిల్లులు పెట్టాల్సి ఉందని, అయితే ఆయన నిర్లక్ష్యం వహిస్తూ.. మూడు వారాలు గడుస్తున్నా.. బిల్లులు పెట్టలేదని వాపోయారు. ఈ విషయంపై ఏపీఓ తులసీ ప్రసాద్‌ను అడగ్గా టెక్నికల్ అసిస్టెంట్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటారని తెలిపారు. కూలీలు చేసిన పనికి మరో టెక్నికల్ అసిస్టెంట్‌తో కొలతలు వేయించి బిల్లులు పెడతామని, కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

సీతారామచంద్రులకు పంచామృతాభిషేకం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం సీతారామ చంద్రస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ధ్వజారోహణం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మల్లాపురం గ్రామ పరిధిలో వెలసినలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో వేదపండితులు సుబ్రహ్మణ్యస్వామి, హరిప్రసాద్, భరద్వాజ్ తదితరులు ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యపూజలు చేశారు. అనంతరం ధ్వజారోహణం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కార్యదర్శి గురురామఘవేంద్రప్రసాద్, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

నీటి ట్యాంకు ప్రారంభం

పామిడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో బేల్దారి షెక్షావలి వితరణ చేసిన వాటర్ ట్యాంక్‌ను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు సోమవారం ప్రారంభించారు. అనంతరం దాతను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వినాయక ఆలయం ఏర్పాటుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, వైద్యులు భూమిపూజ చేశారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

గుత్తి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలతో పాటు నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఒక సెంటు స్థలం వద్దు.. రెండు సెంట్ల స్థలం ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో చాలీచాలని ఒక సెంటు స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ.1.50లక్ష ఇచ్చారని, అది ఎటూకాకపోవడంతో నిర్మాణ దశలో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వమైనా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ అధికారులకు వినతి పత్రాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామదాసు, నాయకులు పద్మావతి, రమేష్, నజీర్, మమత, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో మాట్లాడుతున్న జగదీష్

గుమ్మఘట్ట: మండలంలోని గ్రామాల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం పక్కాఇళ్లు నిర్మించాలని సీపీఐ తాలూకా ఇన్‌చార్జి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు కలుగోడు సచివాలయం వద్ద ఆయన పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో చాలా మంది నిరుపేదలకు పక్కా గృహాలు లేవన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే మూడు సెంట్లు స్థలాలు కేటాయించి పక్కా గృహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, నీలకంఠ, రామాంజనేయులుతో కలిసి సచివాలయం వీఆర్వోకు వినతి పత్రం అందించారు.